# మాటల అడివి

"మాటల అడివి చూస్తావా?" అన్నాడు నా మార్గదర్శకుడు.

మాటల అడివిని గురించి అదివరకు చాలామంది చాలా ఘనంగా చెప్పారు.

"అయ్యో, నువ్వెప్పుడూ మాటల అడివి చూడనేలేదా?... అది చూడని వాళ్ల జన్మ ఎందుకు?... ఆహా! నిజంగా, చూడాలిసిందంతా అందులోనే ఉంది... అది చూడటమే ఒక అనుభవం.... నిజంగా!"

ఇటువంటి మాటలతో నన్ను చాలాసార్లు స్నేహితులూరించారు. సగం బద్ధకం మూలానా, సగం అవకాశం లేకా మాటల అడివిని చూడటం పడనేలేదు. నా మార్గదర్శకుడీ మాట అనగానే నాలో చూడాలనే కోరిక కలిగింది.

"అక్కడ క్రూరమృగాలేమీ లేవు కద?" అన్నాను.

"అటువంటి ప్రమాదం ఏమీలేదు. కాని... తెలిసినవాళ్లు ఒక్కమాట అంటారు. ఆ మాటల అడివిలోకి వెళ్లినవాడు వెళ్లినట్టు వెనక్కు తిరిగిరాడని!"

"అంటే?" అన్నాను ఆందోళనతో.

"మాటల అడివి మనిషిని మారుస్తుంది. దానికేమీ సందేహంలేదు" అన్నాడు నా మార్గదర్శకుడు.

నా ఆందోళన మరింతయింది.

"ఉన్న సంగతేమిటో స్పష్టంగా చెప్పు. నువ్వట్లా నీళ్లు నమిలితే నేనెట్లా నిర్ణయానికి రాగల్ను?" అన్నాను.

"మాటల అడివిలోకి ఆరోగ్యవంతులుగా ప్రవేశించి వింత వింత రోగాలతో బయటికొచ్చినవాళ్లున్నారు. కొందరు రోగులు అడివిలోకి ప్రవేశించి ఆరోగ్యవంతులుగా బయటికి రావటం కూడా నేనెరుగుదును. కొందరు అడివిలో ప్రవేశించి తిరిగి రాకుండా అక్కడే చచ్చిపోవటం కూడా నేను కళ్లారా చూశాను!" అన్నాడు నా మార్గదర్శి.

నాగుండెలవిసినై.

"జబ్బుతోనే?" అన్నాను.

"కాదు, కాదు. ఒక్కొక్కరకం మనుష్యులు మాటల అడివిలో ప్రవేశిస్తే బయటి ప్రపంచాన్ని సంపూర్ణంగా మరిచిపోయి అక్కడే ఉండిపోతారు. కొందరు అడివిలో జొరబడి బొత్తిగా దోవ తప్పి పోయినవాళ్లు కూడా ఉన్నారు. కాని వింత ఏమిటంటే, దోవ తప్పి పోయినామే అనే చింత వాళ్లకుండదు."

"చాలా వింతగా ఉందే ఈ అడివి! చెప్పు, ఇంకా వివరాలు చెప్పు" అన్నాను.

"చెట్ల మూలాన అడివి కనిపించక పోవటమనే సామెత విన్నావా?... అది మాటల అడివిలో ప్రవేశించే ప్రతివాడికీ అనుభవమవుతుంది!... మాటల అడివి మహత్యం విని ఏం ప్రయోజనం? నీవంటి జిజ్ఞాసువు ప్రత్యక్షంగా చూసి తెలుసుకోదగింది అక్కడ ఎంతో ఉంది!" అన్నాడు నా మార్గదర్శి.

అతను నన్ను జిజ్ఞాసువని అనకపోతే మాటల అడివి చూడటానికి బయల్దేరి ఉండను.

❀ ❀ ❀ ❀ ❀

"ఇంకా ఎంత దూరం ఉంది అడివి?" అన్నాను.

"ఇదంతా అడివే! మనం చాలా సేపటినుంచీ మాటల అడివిలో నడుస్తున్నాం" అన్నాడు నామార్గదర్శి.

"మరి నువు నాకిలా చూపించావు కావేం? ఈ చెట్లన్నీ ఏమేమిటో చెప్పు" అన్నాను.

"మనం ముఖ్యంగా చూడవలసింది చెట్లూ కానేకాదు. కొన్ని చూడదగిన చెట్లు తరవాత చూపిస్తాను. ముందు ఇక్కడికి వచ్చే వాళ్లను శ్రద్ధగా గమనించు...

"అడుగో! అ మనిషిని చూడు... ఎట్లా రకరకాల ఆకులు కట్టలు కడుతున్నాడో! ఇతను రాతగాడు. అడివినిండా వీళ్లే జాస్తి. ఇక్కడ కూచుని వీళ్లు పడే యాతన చూస్తే చాలు జాలేస్తుంది. ఒక్కోడు తనకు కావలసిన ఆకు దొరక్క ఝాముసేపు అడివంతా వెతుకుతాడు. ఒక్కోడు కట్టిన కట్టలన్నీ ఒకటికి పదిసార్లు తణిఖీచేసి కట్టిన కట్టలు కొన్ని మళ్లీ విప్పి ఇక్కడిదక్కడా, అక్కడిదిక్కడా చెడమారుస్తాడు."

"ఇవన్నీ చివరికేం చేస్తారు?"

"ఏం చేస్తారు? ఎవరికన్నా మనబోటిగాళ్లకమ్మాలని చూస్తారు. చాలా భాగం అవతల పారేస్తారు. కొందరు తమ కట్టలను ఎవరూ తీసుకోకపోతే తమ పెట్టెల్లోనే పెట్టి దాచుకుంటారు. క్రమంగా అవి ఎండి రాలిపోతై. కొంతకాలమైన తరువాత తీసి చూస్తే బూడిద తప్ప అందులో ఏమీ ఉండదు. ఎక్కువభాగం కట్టలు ఊరికేనే ఇచ్చేస్తారు. ఇందులో చాలాభాగం ఎవరికీ ఏ విధంగానూ ఉపకరించవు. కొందరు ఆటేవి చిన్నవి లేకుండా పెద్ద పెద్ద కట్టలు, మోత చేటువి కడతారు. చివరకు వాటిని పెట్టేటందుకు చోటు కూడా దొరక్క బాధపడతారు."

ముఖ్యంగా కవులను గమనించు, వాళ్లు సామాన్యంగా పూలు లేక ఆకులు తప్ప ముట్టరు. కొందరు పూల మెత్తదనం కోసమే దేవులాడుతారు. మరికొందరు వాసన కోసమూ, రంగుల కోసమూ దేవులాడుతారు. ఏమైనా వాళ్లు చిన్న చిన్న కట్టలు అందంగా కడతారు. ఇవి ఎక్కువ భాగం ఊరికే ఇచ్చేసేవే. ఆరిగింపుకు పనికిరావు."

"చేతిలో ఏమిటో పట్టుకుని ప్రతి చెట్టుకేసి చూస్తూ వస్తున్నాడు, ఆయన ఎవరు?" అన్నాడు.

"ఆయన ఫైలాలిజిస్టు. ఆయన చేతిలోని పాత ఎండిపోయిన ఆకులు అవి ఏ చెట్లపై ఉండవచ్చునో ఈ చెట్ల జాతులేవిటో... చేసుకున్నాడు" అన్నాడు నా మార్గదర్శి.

"కొందరు చెట్లచుట్టూ ప్రదక్షిణం చేస్తున్నారెందుకు?" అన్నాను.

"ఈ అడివిలో ఏమి కనిపించినా నువ్వాశ్చర్యపడనవసరం లేదు. ఈ ప్రదక్షిణాలు చేసేవాళ్ల జీవితం ఇంతే. వీళ్లీ చెట్లను ఇంకే విధంగానూ ఉపయోగించుకోరు. వాటిని దర్శనం చేసుకుని వాటిచుట్టూ ప్రదక్షిణం చెయ్యటమే వాళ్లకు ముక్తి. వీళ్ల తరగతిలోకి వచ్చేవాళ్లే ఇంకొక రకం వాళ్లున్నారు... అదుగో ఆ ముసలాయన్ని చూడు... ఆ చెట్లకింద ఎట్లా పీఠం వేసుక్కూచున్నాడో. ఒకప్పుడాయన ఈ చెట్టు ఆకులను జనానికి పంచిపెట్టి ఘనమైన ఫలితం సంపాదించినవాడు. ఇప్పుడు ముసలాడయిపోయినాడు. ఈయనదగ్గిర ఆకులు పుచ్చుకునేవాడెవడు ఇప్పుడు లేదు. చెట్టూ ఎండుమొహం పట్టింది. కానీ ఈ చెట్టుకిందే కూచుంటాడు. దీన్ని వదిలి పెట్టిరాడు. ఈయన జన్మ ఇంతే!"

"కొందరు చూడు, కొన్నిచెట్ల గాలి సోకుతూనే గజగజలాడుతారు. ఆ చెట్లు విషవృక్షాలని వాళ్ల అనుమానం."

"కొన్ని కొన్ని మతాల వాళ్లకూ తత్వాల వాళ్లకూ కొన్ని చెట్లిష్టం – మొత్తానికి మనిషి తత్వం ఈ అడివిలో బయటపడినంత విచిత్రంగా ఇంకెక్కడా బయటపడదు. గమనించినకొద్దీ నీకే తెలుస్తుంది."

"ఇక మనుషుల్ని మానేసి కొన్ని చూడదగిన చెట్లు చూపిస్తాను."

❀ ❀ ❀ ❀ ❀

"ఇది ముఖ్యంగా చూడదగిన చెట్టు – దేవుడు చెట్టు! చాలా పురాతనమైనది, చాలా విస్తీర్ణమైనది. అంచనాలను బట్టి మిగతా చెట్లకన్నా ఇదే ఎక్కువ ఉపయోగంలో ఉన్నట్టు తేలింది – దీని తాలూకు ఆకులూ, పూలూ, కాయలూ, కొమ్మలూ, రెమ్మలూ, బెరడూ, వేళ్లూ అన్నీ జాస్తిగా వాడుకలో ఉన్నై. ఈ చెట్ల తాలూకు పళ్లు చాలా చేదుగానూ అనారోగ్యంగానూ ఉంటవనీ చెబుతారు. పళ్లు దొరకడమే చాలా అరుదు – శాస్త్రజ్ఞులు, ఈ చెట్టు తాలూకు పరిశోధనలు చేసిన వాళ్లు ఇది మనుషులకేవిదంగానూ ఉపయోగపడదని చెబుతున్నారు. ఈ చెట్టు తాలూకు ద్రవాలు తలకెక్కి అనారోగ్యకరమైన ... ప్రశాంతత, వేదాంత తత్వమూ పుట్టిస్తవని చాలామంది అభిప్రాయం.

"ఈ చెట్టును నిర్మూలనం చెయ్యాలని చాలామంది ప్రయత్నించారు. కాని దీన్నీ అనేక మతాల వాళ్లు సంరక్షిస్తున్నారు. ఒక్కో మతం వాళ్లు చెట్టుకు ఒక్కో పేరు పెట్టారు. కాని క్రియ కొందరికే దీనివల్ల ఉండే ప్రయోజనం.

"ఇది చూడు! ఇది ప్రేమ చెట్టు. ఇది – ఇప్పుడిప్పుడు చాలా వాడుకలోకి వస్తున్న చెట్టు. ఈ చెట్టును వాగలవాళ్లూ, దీని సరి అయిన అనుపానం తెలిసినవాళ్లూ బహుకొద్ది మంది. మిగిలినవాళ్లు దీన్ని కేవలమూ కుర్రకారుకు హుషారివ్వటానికి మాత్రమే ఉపయోగిస్తారు. ఈ చెట్టును చాలా అనుమానంతో చూసే వాళ్లు కూడా ఉన్నారు."

"ఇది కళా చెట్టు. చూడు, దీని చుట్టూ ఎంత మంది ప్రదక్షిణలు చేస్తున్నారో! వెనకటి రోజుల్లో ఈ చెట్టు ఆకులు కొయ్యటానికి చాలామంది వచ్చేవాళ్లుకారు. ఇప్పుడిప్పుడు ఎవరు బడితే వాళ్లెగబడుతున్నారు. అందువల్ల ఇబ్బంది లేదుగాని ఈ ఆకులను గురించి ఎవరి మటుకు వాళ్లు తమ ఇష్టం వచ్చిన విషయాలు చెప్పటంతో చిక్కొస్తున్నది. ఈ ఆకుల గుణాలను గురించి ప్రతివాళ్లూ అతిశయోక్తులాడేవాళ్లే. వీళ్లలో అప్పుడప్పుడు జరిగే ఘర్షణలు వినితీరాలి. ఈ చెట్టు ఆకులు ఎవరుబడితే వారు కొయ్యకుండా కాపలాకాయటానికి ప్రయత్నించే వాళ్లను చూడు. మొత్తం మీద ఈ చెట్టు మూలంగా చాలామంది కాలం వృథాగా చేసుకుంటున్నారు..."

"ఈ రెండు చెట్లూ చూడు. ఇవి నిజమూ, అబద్ధమూనూ..."

"ఇవి చెట్లేమిటి? ఇంత నున్నగా, బోడిగా ఉన్నై!" అన్నాను.

"ప్రతివాడు దీనిమీద చెయ్యివేసి వీటినిట్లా చేశారు. ఇంకో చిక్కేమిటంటే వీటిని ఉన్నచోట ఉండనివ్వరు. ఇక్కణ్నించి తీసి అక్కడా, అక్కణ్నించి తీసి ఇక్కడా పెడుతూ ఉంటారు."

"ఏమిటి? వీటికి వేళ్లు లేవు?" అన్నాను.

నా మార్గదర్శి రెంటినీ తేలికగా పైకెత్తి చూపించాడు. రెంటికిందా రెండు గోతులు మట్టుకున్నై!

"ఇటువంటి చెట్లు ఈ అడివిలో చాలా ఉన్నై. మంచీ, చెడూ – పుణ్యం, పాపం – మొదలైనవి..."

"ఈ అడివిలో ఉన్న చెట్లన్నీ కులగోత్రాలు గలవి. ఒక కులం చెట్ల మధ్య ఇంకోకులం చెట్టొకటి వచ్చిపడితే లబ్బున మొత్తుకునే వాళ్లున్నారు. ఇంతగా జాగర్త తీసుకుంటున్నప్పటికీ దీనికి అడివి లక్షణం పోలేదు... ఇక్కడ ఎండిపోతీన చెట్లు చాలా కనిపిస్తై. కాని వాటిని పీకెయ్యటానికి ఒప్పుకోరు కొందరు. వాళ్లు దాని బెరడయినా వాడతారు గాని వదిలిపెట్టరు..."

"ఇక్కడ ఒక్కోవైపు ఒక్కో భాషకు చెందిన చెట్టులన్నై. ఒక భాష తాలూకు చెట్లకూ ఇంకో భాష తాలూకు చెట్లకు తేడా ఏమి కనిపించదు. కాని వాడుకలో ఫలితాలు వేరువేరుగా ఉంటున్నై. నేలలో ఏదో ఉండి ఉంటుంది అన్నాడు" నా మార్గదర్శి.

***రచన : 1943 ?***

***ముద్రణ : కుటుంబరావు సాహిత్యం ఆరవ సంపుటం,***

***విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్, డిసెంబర్ 1994***